# ఎలా మోసపోతారబ్బా!

—I.M.A. సావనీర్ 1985

వస్తువు తక్కువ ధరకు వస్తున్నప్పుడు "అదెలా వీలవుతుంది?" అని ఆలోచిస్తే మనం మోసగించబడం.

—జయప్రద

---

"రేలీ ఫేన్సు వున్నాయా?"

అసలే సీజన్ డల్‌గా మనసు దిగులుగా వున్న సమయం. ఆ ప్రశ్న శ్రవణానందంగా విన్పించిందేమో దివ్యగీత షోరూమ్ మేనేజింగ్ పార్టనర్స్ ఇద్దరం చప్పున లేచి నిల్చున్నాం. సేల్స్‌మేన్ నాలుగడుగులు ముందుకేసాడు.

"అవి లేవు సార్. కూల్ హోమ్ చాలా బాగా పనిచేస్తున్నాయి. చూపించమంటారా?" అన్నాను వినయంగా.

నల్లసూటు, నల్లచలవ కళ్ళద్దాలు, నల్లటి దేహచ్ఛాయతో అమ వ్యాసలా వున్నా, ఆ వ్యక్తి జేబుమటుకు బరువుగా చాలా ఆకర్షణీయంగా వుంది.

రేలీఫ్యాన్ లేదనగానే అమావాస్య కనుబొమ్మలు ముడుచుకున్నాయి.

వెళదామా పోనీ కూల్‌హోమ్ చూద్దామా అన్నట్లు అసహనంగా నిల్చున్నాడు.

నేను ఆయన్ని రోజు పోనీ దల్చుకోలేదు.

"మీరుండండి సార్ రేలీఫ్యాన్ తెప్పిస్తాను"

అమావాస్య ఠీవిగా కూర్చున్నాడు.

జేబులో నుండి ఖరీదయిన సిగరెట్ తీసి లైటర్‌తో వెలిగించుకుని - కాలం చాలా విలువయిందన్నట్లు మాటిమాటికి తన చేతివాచీవంక చూసుకుంటున్నాడు.

"ఇదిగోండి సార్, ప్యాక్ చేయమంటారా?"

"ఊఁ"

"ఆటోలో పెట్టించమంటారా?"

"ఊఁ"

అతను బాలయోగి శిష్యుడిలా వున్నాడు ఎక్కువ మాట్లాడటంలేదు.

"రెడీ అయింది సార్" సేల్స్‌బాయ్ చేతులు కట్టుకుని నిల్చున్నాడు.

"ఊఁ"

అతను జేబులో నుండి చెక్ బుక్ తీసాడు. పార్కర్ పెన్‌తో తన సంతకం చేసి "బిల్ ఎంత?" అన్నాడు.

ఇద్దరం ముఖముఖాలు చూసుకున్నాము.

"మరేమీ అనుకోవద్దు సార్, మేము చెక్స్ ఏక్సెప్ట్ చెయ్యడం లేదు."

"ఓ ఇట్సాల్‌రైట్. మీ బోయ్‌ను పంపండి. సౌందర్యాహోటల్ కౌంటర్‌లో మా మేనేజరు వుంటాడు మనీఇప్పిస్తాను."

"అలాగేసార్. వెళ్ళవోయ్"

అమావాస్య చీకటి షాపున్ని వదలి ఆటోని ఆశ్రయించింది. ఆటోలో కాలు మోపబోయి ఆగి తల మటుకు వెనక్కు త్రిప్పి సేల్స్ బాయ్ వైపు నిర్లక్ష్యంగా చూసి మాకు వినిపించేలా.

"ఆ కూల్‌హోమ్ కూడా వుంచండి. మా నాన్నగార్కి కావాలంటున్నారు. అవసరం లేకపోతే మీ బాయ్‌తో పంపిస్తాను" బాయ్ లోపలకు పరుగెట్టాడు. బిల్ సెకండ్‌మీద తయారయ్యి అమావాస్య చేతిలో పడిపోయింది. ఆటో దూసుకుపోయింది.

"దేనికయినా చొరవ కావాలి పటాన్." ఆ అమావాస్య కేసును పోనీకుండా ఈరోజు రెండు ఫ్యాన్స్ సేల్ చేసిన గర్వం నా మాటల్లో వుంది. పటాన్ నవ్వేసాడు.

* * * *

కొలిస్తే ఒక కిలో చెమటతో, మరో కేజి భయంతో, తడబడే కళ్ళతో అడుగు బెట్టాడు సేల్స్‌బాయ్. బిల్స్ వ్రాసుకుంటున్న పటాన్ తలెత్తలేదు. కౌంటర్ దాక నడచివచ్చిన సేల్స్‌బాయ్ దబ్బవ్వక పోతాడా?

"సార్"

"ఏమి?"

"అతను....అతను...." అతనికి సరిగ్గా నోటమాట రావడం లేదు కొద్దిగా అనుమాన మేసిన పటాన్ తల పూర్తిగా ఎత్తి సేల్స్ బాయ్‌ని జూసి కొంత అర్ధం చేసుకున్నాడు.

"నువ్వు వెంట వెళ్ళలేదా?"

"వెళ్ళానుసార్"

గ్లాస్ రూమ్‌లో హెచ్. యమ్. వి. రికార్డు అందంగా సర్దుతున్న నాకు ఆ మాటలు లీలగా విన్పించాయి.

"ఏమైంది? డబ్బివ్వలేదా?"

"ఫ్యాన్స్ ఏవీ" ఇంచుమించు పరుగెట్టాను.

బిత్తర పోయాడు పిల్లాడు. చేతిలో పలావ్ పొట్లాం క్రింద పడి పోయింది.

★ ★ ★ ★

"ఆటో ఇక్కడ ఆపవయ్యా-నువ్విక్కడ వుండు నేను మా మేనేజర్‌తో డబ్బివ్వమని చెప్పి వస్తాను"

సేల్స్‌బాయ్‌కి అమావాస్య అంటే చాలా భక్తిగా ఉంది. ఎంత డబ్బుందో అతనికి. మనిషి నల్లగా వుంటే మాత్రమేం? ఎంత ఠీవిగా వుందా సూట్.

అమావాస్య లేచాడు. దర్జాగా ఆటో దిగాడు. ప్యాంటు జేబులో చెయ్యి పెట్టుకొని పెద్ద పెద్ద అడుగులతో ఇంకా దర్జాగా నడచి కౌంటర్ దగ్గర కెళ్ళాడు. నవ్వుతూ ఏదో మాట్లాడాడు. వెనక్కి తిరిగి ఆటోలో నల్ల సూటు వైపు ఆరాధనగా చూస్తూ కూర్చున్నా బాయ్‌వైపు చేతితో చూపిస్తూ ఏదో చెప్పాడు. మేనేజర్ సరేనని తల వూపడం గూడా సేల్స్ బాయ్‌కి కన్పించింది.

అమావాస్య మరలా వెనక్కి తిరిగి అదే దర్జా నడకతో ఆటో చేరాక "వెళ్ళవోయ్. డబ్బిస్తాడు తీసుకెళ్ళు. మీ బాస్‌కి నా థాంక్స్ చెప్పు."

"అలాగేసార్!" బాయ్ ఆలోచిస్తూ అమావాస్య ఐశ్వర్యానికి ఇసుమంత ఈర్ష్యపడుతూ కౌంటర్‌ని చేరాడు. బాయ్‌ని చూస్తూనే మేనేజర్ గుర్తు పట్టాడు.

"అలా కూర్చో, ఇప్పుడే తెప్పిచ్చిఇస్తాను."

బోయ్ బుద్ధిగా కూర్చున్నాడు. అమావాస్య తాలూకు ఆలోచనలతో ఐదు నిముషాలు వెనక్కి తప్పుకున్నాయి. ఆలోచనలలో నుండి తేరుకొని తలె త్తేసరికి మరో బాయ్ ఏదో ప్యాకెట్ తెచ్చి అతనిచేతిలో పెట్టాడు. ఉలిక్కి పడ్డాడు సేల్స్‌బాయ్. సౌందర్యా లాడ్జింగ్ అండ్ బోర్డింగ్ అని వ్రాసున్న గ్రౌన్ కవరు అది. అందులో ఏదో బరువుగా వేడిగా వుంది.

ఆ కవరును విప్పాడు.

అందులో మోదుగాకులతో కుట్టిన ఇస్త్రాకులో వేడివేడిగా ఘుమాయిస్తూ బిరియానీ–కౌంటర్ దగ్గరకు పరుగెత్తాడు.

"ఇదేమిటి సార్!"

"ఏమైంది?"

"డబ్బు....అతనికి" నోరు తడారిపోతోంది. "అదా! మీ యజమాని ఇచ్చాడులే. అదేమి తొందరో! చిల్లర ఇస్తున్నా తీసుకోకుండా వెళ్ళాడు. మీ యజమాని బాగా ఆస్తిపరుడులాగున్నాడు కదోయ్ "

ఆ మేనేజరు బాగా మాయాడిలాగున్నాడు. బాయ్‌కి మాత్రం తల తిరిగిపోయింది. చప్పున తల త్రిప్పి చూసాడు. అక్కడ ఆటోలేదు.

* * * *

"ఆ తర్వాత?"

"ఇంకేముంది? ఇంతే సంగతులు!"

నేను నీరసంగా నా ఇంట్లో అడుగు పెట్టేసరికి ఆ పై సంభాషణలో వున్న నా శ్రీమతి, ఆమె స్నేహితురాలు లేచి నిల్చున్నారు.

"కూర్చో ఇప్పుడే వస్తాను" అని స్నేహితురాల్ని కూర్చోబెట్టి, లోపలికెళ్ళి—

నా రాకతో లేచి నిలబడ్డ అతిథిని కనీసం మర్యాదకయినా 'కూర్చోండి' అనని నా పరధ్యానానికి నేను పశ్చాత్తాప పడేలోపలే కాఫీ కప్పుతో తిరిగొచ్చేసింది మా కామాక్షి.

"ఇది విన్నారా పాపం" ఇక క్షణమయినా ఆగలేనట్లు కాఫీ కప్పు నా కందిస్తూనే మొదలెట్టేసింది.

"మా భారతి మోసపోయిందండీ" నేను మనస్సులోనే ఉలిక్కిపడ్డాను.

"ఈ రోజు ఎవడో వచ్చి, అయ్యగారు మీకు షుగర్ తెచ్చివ్వమన్నారు, కార్డు డబ్బు ఇప్పిస్తారా అని అడగ్గానే ఇచ్చేసిందట పిచ్చి మొద్దు"

"లేదే, నా కప్పటికీ అనుమానమొచ్చి, నా సర్వెంట్ గర్ల్ చిన్న పిల్ల వుంటే తోడుకూడా పంపాను" సర్దింది నా శ్రీమతి స్నేహితురాలు.

"అయినాగాని, ఎవడో ముక్కూ ముఖం తెలియని వాడొచ్చి అడగ్గానే యిచ్చేయడమేనా? వాడెవడో నువ్వు అమాయకురాలివని గ్రహించేసాడు."

నాకు నవ్వొచ్చేస్తోంది. మా కామాక్షి మర్చిపోయిందో, మర్చిపోయినట్టు నటిస్తూందోగాని, అచ్చు ఇలాగే మోసపోయిందామె. నాలుగు నెలల క్రితము-

మా బెడ్రూమ్ ప్రక్కనున్న చిన్న వరండాని లెవిట్రీగామారిస్తే బాగుంటుందని ఆ పని ప్రారంభించాము: ఇంచుమించు పనంతా పూర్తి అయింది. కానీ ఏదో ఏ. సి. సిమెంటు పైపొకటి తక్కువయింది. మా ప్లంబర్ని తెమ్మంటే అప్పుడే ఆరయి పోయింది రేప్రొద్దున్నే తెస్తానండీ అని చెప్పి వెళ్ళిపోయాడు.

మర్నాడు ప్రొద్దున్నే టంచనుగా "మస్తాను మామ మిమ్మల్ని అడిగి డబ్బులు తీసుకొని సిమెంటు పైపు తెమ్మన్నాడు:" అని ఓ పద్దెనిమిదేళ్ళ కుర్రాడు అడగ్గానే డబ్బిత్తి చేతితో పెట్టేసింది. అటు వాడు వెళ్ళగానే మా మస్తాన్ ప్రత్యక్షమై మా శ్రీమతికి నూటొక్క మోసాలు, నూటొక్క నీతులు చెప్పి వెళ్ళాడు.

అనాడు మా శ్రీమతి మోసపోయిన మొత్తం చిన్నదే కావొచ్చు. కానీ మొత్తానికి తనూ మోసపోయింది కదా.

"అదేవిటి కామాక్షి! నమ్మకుండా ఎలా వుండనూ? ప్రతినెలా మా వారు షుగర్ తెప్పించుకోవడానికి వాళ్ళ ఆఫీస్ ప్యూన్ని పంపిస్తాడు. అప్పటికి కొత్తముఖం లాగుందే అని అనుమాన మొచ్చేకదా! మా సర్వెంట్ గర్ల్ని తోడు పంపాను."

"ఆ తర్వాతేమయిందీ?" కుతూహలంగా అడిగాను.

"ఏమవుతుందీ? ఆ పిల్లను ఇప్పుడే తెస్తాను. ఇక్కడే వుండు" –అని చెప్పి డబ్బు, షుగర్ కార్డు తీసుకొని జనంలో మాయమై పోయాడట."

మరోసారి భుజాలు తడుముకున్నాను నేను. "వెధవది డబ్బు పోతేపోయింది ఇప్పుడు మరో షుగర్కార్డు తెచ్చుకోవాలంటే ఎంత తతంగమనీ!" అంటూనే నేను కాఫీ త్రాగి వదిలేసిన కప్పు–సాసరు తీసుకుని లోపలికెళ్ళింది నా శ్రీమతి.



285837

భారతికూడా చప్పున లేచి వెళ్ళబోయి ఏదో గుర్తు వచ్చినద్దాని లాగ మరలా కూర్చొని మొదలెట్టింది. తమలాగే మోసపోయినవ్వాళ్ళ కధలు చెప్పాలంటే ఎవరికయినా సరదానే.

మా పాత పనిమనిషి ఒకరోజు కూరలకెళుతుంటే దోవలో-నిగ నిగ మెరిసిపోతూ నాలుగు పేటల బంగారు గొలుసు కనిపిస్తే చటుక్కున వంగి తీసుకుని బొడ్లోదోపుకోబోయేలోపల ఒక రౌడీలాటి వ్యక్తి వచ్చి దానిచెయ్యి పట్టుకున్నాడట.

"దొరికిన వస్తువు బొడ్లో దోపుకోవడమే. గవర్నమెంటోళ్ళకి చెప్పానంటే కటకటాలవతలకు తోస్తారు నిన్ను" అన్నాడట ధీమాగా. బిత్తరపోయిందట మా పనిమనిషి.

"పోనీలే ఆడకూతురివి. ఆశపడ్తున్నావు. దాంట్లో సగం నాకిస్తే వివ్వాదిలేస్తా" అని మా పనిమనిషి ఇంకా ఆ భయంనుండి తేరుకోక ముందే "పోనీలే పాపం ఆ గొలుసు మెళ్ళో ఏసుకుంటావు కాబోలు తెంపటానికి మనసొప్పనట్టుంది, ఆ చెవుల్లో కమ్మలు ఇచ్చెయ్యి ఎళ్ళిపోతా" అన్నాడట దానిమీద బోల్డు జాలిపడిపోయి.

అప్పటికి తేరుకున్న అది గబగబ కమ్మలిచ్చేసి కూరగాయ లయినా కొనకుండా పరిగెత్తుకుంటూ నా దగ్గరకొచ్చి ఆ నగ నా చేతిలో వుంచి వగరుస్తూ అంతా చెప్పింది.

నిజం చెప్పొద్దూ! దాని అదృష్టానికి నాకు ఈర్ష్యకూడా కలిగింది. ఎంత బరువుగా వుందనీ అది- చాలా పాత నగ. అపరంజి లాగుంది.

అప్పటికప్పుడే మా నగల బత్తుణ్ని పిలిచి ఎన్ని సవర లుంటుందో చూడమన్నాను. వాడు దాన్ని పరీక్ష చేసి-

"ఇదెక్కడిదమ్మా?" అన్నాడు అనుమానంగా.

"దొరికింది, అపరంజిలాగుంది కదూ!" నాకు మా టెన్షన్‌గా వుండింది.

అతను నసుగుతూ చావుకబురు చల్లగా చెప్పాడు. అది బంగారం కాదట. జింక్ మీద పోతట."

ఆమె తన కథనం మధ్యలో కొచ్చేసరికి నాకు పూర్తిగా బోధ పడిపోయింది.

మేము షాపు ప్రారంభించిన కొత్తలో బంగారం విషయంలో ఇలాగే మోసపోబోయాము. కానీ మా పటాన్ పిరికితనం నన్ను రక్షించింది.

కొత్తగా షాపు ఓపెన్ చేసి లీజర్లీగా కూర్చొనున్నాము. పల్లెటూరి పేదవాడు ఒకతను ఎంటర్ అయ్యాడు. మా షాపులో వుండే వన్నీ చాలా ఖరీదయిన వస్తువులే.

చేతులు నలుపుకుంటూ వస్తున్న ఆ పేదవాడిని నిర్లక్ష్యంగా చూస్తూ కూర్చున్నాం.

వాడు అతి అమాయకంగా మమ్మల్ని చేరుకున్నాడు. ఎర్రటి తలగుడ్డ, వెలసిపోయిన మరో ఎర్రని పంచెగుడ్డ తప్ప ఒంటిమీద ముతో ఆచ్ఛాదనలేదు.

"ఏం కావాలి?" అదే నిర్లక్ష్యంతో అడిగాను.

"నాకేటీ వద్దు బాబుగారు. నాకాడ కొన్ని ఎండినాళాలున్నాయి. పొట్టకూటికొరకు ఈ పట్నాని కొచ్చాము. మా ఆళ్ళకి ఈటిని పంపాలంటే ఏం చేయాలి దొరా!" అంటూ నాలుగు వెండినాణాలు తీసి మా కౌంటరు మీదుంచాడు.

మా పటాన్ వాడివైపు అనుమానంగా చూస్తున్నాడు. నాకు వాడినిచూస్తే జాలేసింది.

"పార్సెల్ చెయ్, లేదంటే వాటిని అమ్మేసి మనీఆర్డర్ చెయ్."

"నాకేటి తెలుసుద్ది బాబూ! నాకు దిక్కుతోచక దోవనబోతూ మీరగపడితే ఇటు దూరాను. కాస్త అదేదో మీరు చూసిపెట్టండి దొరా దండాలెడ్తాను."

"అసలు అది నీకెక్కడిది?" కసురుతున్నట్లడిగాడు మా పటాన్. వాడు వణికిపోయాడు. అటు ఇటు జూసి మాకింకాస్త దగ్గరగా జరిగాడు.

"బాబుగోరూ మీకు నిజం చెప్పేస్తాను. మీరెవ్వరికీ సెప్పకండి దొరా! పొట్టకూటికొరకు, పెళ్ళాం బిడ్డల్నీ విడిసొచ్చినోళ్ళం. మొన్న ఓరిదో పాతఇల్లు పగలగొట్టటాన్కి కూలీకి పిలిస్తే ఎళ్ళాము. ఆ గోడలో ఈ ఎండి నాళాలు, ఈ గొలుసు దొరికినాది" వాడింకా ఒణికి పోతూనే గొలుసుతీసి గుప్పిట్లో పట్టుకున్నాడు.

"అది బంగారమని నీకెట్టా తెలిసింది?" గుప్పెట మూసినా, ఇంకా కాస్త బయటకు కనబడుతూనేవున్న ఆ లావుపాటి పాతనగ వంక నిశితంగా చూస్తూ అడిగాడు పటాన్.

"అంతా ఎత్తుకెల్లాలంటే బయమేసి నిన్న కాసంతముక్క తెంపి మార్వాడివాడి కాడికి తీసుకెళ్ళాను. వాడు నన్ను మోసంచేసాడు దొరా, పదిరూపాయలు చేతిలో పెట్టాడు, ఇదేంటంటే అసలు నువ్వు నాకు బంగారం ఎప్పుడిచ్చావని నన్ను తర్మిమేసిండు. అందుకే దొరా మీరే నాకు సాయం చేయాలి. సాయం చేసినందుకు మీరూ కాసంత తెంపుకోండి."

నాకు ఆశ కలిగింది.

ఎవడికో దీన్ని అమ్మిపెట్టి, బ్రోకరుపని చేసి కూలీ తీసుకోవడమేమిటి? అమాయకుడిలా గున్నాడు. చీప్‌గా ఇచ్చేస్తాడు కొనేస్తేసరి. కామాక్షికూడా మెళ్ళోవన్నీ అమ్మేసానని గొడవపెడుతూంది.

"ఎంతకిస్తావోయ్...."

పటాన్ నా వైపు చిత్రంగా జూసాడు.

"మీ దయ దొరా"

"రెండువేల కిస్తావా?"

అది ఎంత లేదన్నా యాభయ్ సవర్లుంటుంది. సవర నాలు గొందలేసుకున్నా 20 వేలు చేస్తుంది.

"అయ్యగోరూ మరోవెయ్యి ఇప్పించండి." బేరంచెయ్యాలి కాబట్టి చేస్తున్నట్టున్నాడేకాని, దాని అసలు విలువ వాడికి తెలిసినట్లులేదు. నేను మనసులోనే నవ్వుకుని-

"సరే" నన్నాను.

"అసలది బంగారమో కాదో మొదట టెస్ట్ చేయించు" ఇంగ్లీషులో అన్నాడు పటాన్ కాస్త విసుగ్గా.

నాకుకూడ అదే నిజమనిపించి వాడినో ముక్క ఇమ్మని అడిగాను.

"మీకు అనుమానమైతే అంతా అట్టుకెళ్ళండి దొరా రేపొస్తాను డబ్బిద్దురుగానీ. మడిసిని మడిసి నమ్మాలేగాని" నేను కాస్త గిల్టీగా ఫీల్ అయ్యాను వాడు నన్ను నమ్మినంతగా ఆ అమాయకుణ్ని నేను నమ్మలేకపోయాను కదా అని.

నా ఆలోచనలు మా పటాన్ కని పెట్టేసినట్లున్నాడు. నేనెక్కడ ఆ నగ తీసుకుని డబ్బిస్తానేమోనని భయపడి, వాడి నడిగి చిన్నముక్క తీసుకుని మర్నాడు రమ్మని వాడిని బలవంతంగా పంపేశాడు.

వాడు మర్నాడు రాలేదు. మాకు తెలిసిన మార్వాడి స్నేహితుడు మమ్మల్ని చూసి పకపక నవ్వాడు.

"అది బంగారంకాదు. జింకు. బహుశా ఆ ముఠాలోనివాడే వీడూ అయ్యుండాలి."

స్నేహితురాలిని పంపించేసి-

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంటూ వచ్చిన శ్రీమతితో నాకీరోజు జరిగిన మోసం గురించి చెప్పెయ్యబోయి ఆగిపోయాను. నా సమర్థత మీద నా శ్రీమతికి చాలా నమ్మకం. దానిని పోగొట్టుకోదల్చుకోలేదు. నేను లేచి నిలబడి లోపలకెళ్ళబోతూ అన్నాను.

"ఏమీలేదు, అసలు జనం ఎంత అమాయకంగా మోసపోతారా?" అని ఆలోచిస్తున్నాను.

❋